సంపుటి : 9
సంచిక : 347
మంగళవారం
08 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999



# కార్యకర్తలే పార్టీకి బలం

## వారిని ఉన్నత స్థాయికి తీసుకురండి

- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచన
- సమస్యల పరిష్కారంలో మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి కేటాయింపు
- టెక్నాలజీతో వందేళ్ల పనిని పదేళ్లలో పూర్తి చేయవచ్చన్న ముఖ్యమంత్రి

**అమరావతి, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కీలక దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల రాజకీయ, ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, అదే సమయంలో స్వర్ణాంధ్ర విజన్-2047ను క్షేత్రస్థాయిలో అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్పష్టం చేశారు. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని, వారిని నిరాశకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "టీడీపీ కార్యకర్త హుషారుగా ఉంటే గెలుపును ఎవరూ ఆపలేరు. కార్యకర్తల్లో చాలా మంది పేదవారు ఉన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు వారికి అందేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగా పనిచేసిన వారికి, అక్కడి పరిస్థితులను బట్టి టికెట్లు కేటాయిస్తాం. వారు వ్యాపారాలు చేసుకుని అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యేలు ప్రోత్సాహం, మార్గనిర్దేశం అందించాలి. ప్రజలు మెచ్చే విధంగా కార్యకర్తలకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారే జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

**విజన్-2047తో నియోజకవర్గాల అభివృద్ధి**

స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విజన్‌కు నియోజకవర్గాల స్థాయిలో ఎమ్మెల్యేలు తమ ఆలోచనలతో విలువ జోడించాలని (వాల్యూ ఎడిషన్) సూచించారు. "విజన్ ప్లాన్ అమలు చేస్తే అభివృద్ధి సాధ్యమవడమే కాదు, ఎన్నికల్లోనూ గెలుపు ఖాయం. పేద-ధనిక మధ్య అంతరాలు తగ్గించడమే ఈ విజన్ ప్రధాన లక్ష్యం. ఆర్థిక కష్టాలు మిగతా .. 2లో..

నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుమల శ్రీవారిని

# దర్శించుకున్న యూపీ సీఎం యోగి

- వెంకయ్య నాయుడు ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధి అని ప్రశంస
- స్వర్ణ భారత్ ట్రస్ట్ 25 ఏళ్ల సేవలను కొనియాడిన యోగి ఆదిత్యనాథ్
- గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ట్రస్ట్ నెలకొల్పామన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- తన పిల్లలను రాజకీయాలకు దూరం పెట్టానని, సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరిన వెంకయ్య



**తిరుమల, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు నెల్లూరు జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడి నుంచి నేరుగా తిరుమల చేరుకున్నారు. తిరుమలకు విచ్చేసిన యోగికి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన ఆయన, స్వామివారి దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు యోగి ఆదిత్యనాథ్‌కు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు ఆయనను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. యూపీ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు మిగతా .. 2లో..

# శంషాబాద్ పోలీసుల అదుపులో యూట్యూబర్ నందన



**హైదరాబాద్, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** యూట్యూబర్ నందనను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లుక్ అవుట్ నోటీసులు జారీ కావడంతో నందనను పోలీసులు గుర్తించారు. అనంతరం ఏపీలోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం మిగతా .. 2లో..

మెగా డీఎస్సీపై ఆరోపణలు నిరాధారం..

# వేధిస్తే కఠిన చర్యలు

- మెగా డీఎస్సీ 2025 నియామకాలపై ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం
- స్పోర్ట్స్ కోటా ఎంపికలు పారదర్శకంగా జరిగాయన్న క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)
- ఉపాధ్యాయులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- టెట్ అర్హతలపై పలువురు అభ్యర్థుల విషయంలో స్పష్టత ఇచ్చిన అధికారులు



**అమరావతి, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మెగా డీఎస్సీ 2025 నియామకాలపై గత పది రోజులుగా సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. స్పోర్ట్స్ కోటా సహా ఇతర నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, మొత్తం ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని స్పష్టం చేసింది. అమరావతిలోని విద్యాభవన్‌లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ భరణి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి మిగతా .. 2లో..

పశ్చిమాసియా ఉద్రిక్తతలు..

# హర్మూజ్ వద్ద 'నిషేధిత జోన్'



**సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే టెహ్రాన్ కీలక నిర్ణయం తీసుకుంది. హర్మూజ్‌లో తాము సూచించిన మార్గంలో కాకుండా వేరే రూట్‌లో వెళ్లడానికి యత్నిస్తున్న నౌకలను అడ్డుకునేందుకు.. జలసంధి వెలుపల ఓ నిషేధిత ప్రాంతాన్ని ప్రకటించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మిగతా .. 2లో..

చంద్రబాబు కేవలం తెలుగుదేశం ఆస్తి కాదు..

# యావత్ తెలుగుజాతి ఆస్తి

**టీడీపీ నేతల సమావేశంలో స్వర్ణాంధ్ర విజన్ 2047పై మంత్రి పయ్యావుల ప్రజెంటేషన్**




**అమరావతి, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం తెలుగుదేశం పార్టీ ఆస్తి కాదని, యావత్ తెలుగు జాతి ఆస్తి అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అభివర్ణించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో భాగంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047' డాక్యుమెంట్‌పై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయకత్వ దార్శనికతను, ఆయన రూపొందించిన విధానాల వల్ల కలిగిన ప్రయోజనాలను ఉదాహరణలతో వివరించారు. ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "వాట్ చంద్రబాబు థింక్స్ టుడే, నేషన్ థింక్స్ టుమారో (చంద్రబాబు ఈరోజు ఆలోచించింది, దేశం రేపు ఆలోచిస్తుంది)" అనేది అక్షర సత్యమని పయ్యావుల అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు రూపొందించిన 'విజన్-2020' దేశంలోనే తొలి విజన్ డాక్యుమెంట్ అని, దానిని చూశాకే అనేక రాష్ట్రాలు తమ విజన్ పత్రాలను తయారు చేసుకున్నాయని గుర్తుచేశారు. నాడు విజన్-2020ని కొందరు అవహేళన చేసినా, అదే రాష్ట్రానికి దిక్సూచిగా మారిందని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టికి ఐటీ రంగం అభివృద్ధి ఒక నిదర్శనమని మిగతా .. 2లో..

అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

# సీఎం అభ్యర్థి నేను కాదు

- ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి
- రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న
- తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి



**అమరావతి, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో మిగతా .. 2లో..

# మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం : కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ వద్ద పోలీసులు వ్యవహరించిన తీరును రాష్ట్రం మొత్తం చూసిందన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకుని గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. ఆమెపై దాడికి బాధ్యుడు సీఎం రేవంత్‌రెడ్డే. కోవా లక్ష్మి లేకుంటే సునీతా లక్ష్మారెడ్డి ఇనుప కంచెలపై పడేవారు. శాసనసభ దుశ్శాసన పర్వంలా మారింది. డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్, డైవర్షన్ మాత్రమే రేవంత్‌కు తెలుసు. మహిళలపై దాడిని కప్పిపుచ్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. మమ్మల్ని ఆపాలని స్పీకర్ చెప్పారంటూ పోలీసులు చెబుతున్నారు"

**స్పీకర్‌పై అవిశ్వాసం.. ఆలోచిస్తాం**

"మేం నిలదీస్తామని తెలిసే.. మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారు. మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా

అట్టడుగు వర్గాల బిడ్డలమనేనా..

# ఇంత అవమానం?: మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ సభ్యుల తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని తెలంగాణ మంత్రి సీతక్క విమర్శించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఆ పార్టీ సభ్యుడు తాతా మధు అత్యంత హేయమైన భాష వాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలన్నారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు. "తాతా మధు వ్యాఖ్యలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలి. ఆయన డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ సభ్యులు ఇలా మాట్లాడారు. దళితులంటేనే ఆ పార్టీకి నచ్చదు. స్పీకర్‌గా దళితుడు ఉండటం కేసీఆర్‌కు నచ్చదు. దళితుడైన స్పీకర్‌ను మిగతా .. 2లో..

# ఇస్రో ప్రైవేటీకరణ ఉండదు

## ఛైర్మన్ వి.నారాయణన్



**సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలకు ఆ సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ తెరదించారు. ఇస్రోను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని చెప్పారు. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలపై వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పెరిగినా.. ఇస్రోకు ముప్పు లేదని తెలిపారు. బెంగళూరు స్పేస్ మిగతా .. 2లో..

# లంచాలను ఈఎంఐల్లాగా ఇవ్వాల్సి వచ్చింది

## డీఎంకేపై విజయ్ తీవ్ర విమర్శలు



**సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సీఎం విజయ్ విరుచుకుపడ్డారు. బ్యాంకు రుణాలకు ఈఎంఐలు కట్టినట్టుగా వాయిదాల పద్ధతిలో ప్రభుత్వ కాంట్రాక్టర్లు ఆ ప్రభుత్వానికి లంచాలు ఇచ్చుకోవాల్సి వచ్చిందని విమర్శలు గుప్పించారు. దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పొందుపర్చిన వివరాల ఆధారంగా తాను ఈ విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్ విలువలో ఆ మొత్తం 10 శాతం వరకు ఉండేదన్నారు. "పార్టీ నిధుల కోసమని చెప్పి, మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# కార్యకర్తలే పార్టీకి బలం

ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గానికి రూ.1 కోటి చొప్పున కేటాయించాలని నిర్ణయించాం" అని తెలిపారు. కేంద్ర మంత్రులుగా ఉన్నవారు జాతీయ స్థాయిలో శాఖలను పర్యవేక్షిస్తున్న స్ఫూర్తితోనే తమ జిల్లాలను అభివృద్ధి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల్లో ఉన్నత విద్యావంతులు, రిటైర్డ్ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారంతా తమ అనుభవంతో విజన్ డాక్యుమెంట్లను అధ్యయనం చేసి, వినూత్నంగా ఆలోచించాలని కోరారు. "వందేళ్లలో జరిగే పనులను పదేళ్లలో పూర్తి చేసే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. ప్రతి ఎమ్మెల్యే అకుంఠిత దీక్షతో పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని చంద్రబాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు 28 కొత్త పాలసీలు తీసుకొచ్చినట్లు ఆయన గుర్తుచేశారు.

### నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుమల శ్రీవారిని

# దర్శించుకున్న యూపీ సీఎం యోగి

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

**స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రస్థానం ఆదర్శనీయం: యోగి**

అంతకుముందు, యోగి ఆదిత్యనాథ్ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో జరిగిన 'స్వర్ణ భారత్-సేవా హారతి' రజతోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ట్రస్ట్ చేపట్టిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. వెంకయ్య నాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు అందరినీ ఐక్యంగా ముందుకు నడిపారని, ఉత్తర, దక్షిణ భారతాలకు సాంస్కృతిక వారధిగా నిలిచారని ప్రశంసించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర ప్రాంతాలకు పరిచయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్' ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్ట్ సేవలు దోహదపడుతున్నాయని తెలిపారు.

**గ్రామీణాభివృద్ధే మా లక్ష్యం: వెంకయ్య నాయుడు**

ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గ్రామీణ భారతం పురోగమించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతోనే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పినట్లు తెలిపారు. యువత తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే నిజమైన సాధికారత అని పేర్కొన్నారు. తన కుమార్తె దీపా వెంకట్‌కు ట్రస్ట్ బాధ్యతలు అప్పగించానని, కుమారుడు హర్షవర్ధన్ ఫౌండేషన్ ద్వారా సేవ చేస్తున్నారని వివరించారు. తన పిల్లలను రాజకీయాల వైపు ప్రోత్సహించలేదని, అయితే వారి సేవా కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని కోరారు. ఈ వేడుకల్లో ఏపీ మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ పోలీసుల అదుపులో యూట్యూబర్ నందన

ఇచ్చారు. లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి భారీగా డబ్బు వసూలు చేసినట్లు నందన దంపతులపై ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కేసు నమోదు కావడంతో ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నందనపై ఉన్న కేసులు, లుక్ అవుట్ నోటీసుల ఆధారంగా తదుపరి చర్యలకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# వేధిస్తే కఠిన చర్యలు

పూర్తి వివరాలు వెల్లడించారు. ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడితే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**స్పోర్ట్స్ కోటా నియామకాలు పారదర్శకం: శాప్**

స్పోర్ట్స్ కోటా ఎంపికలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరిగాయని శాప్ ఎండీ భరణి తెలిపారు. తుది జాబితాకు ముందు 1:5 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేసి, 2025 ఆగస్టు 8 నుంచి 14 వరకు అభ్యంతరాలకు అవకాశం కల్పించామని, ఆ సమయంలో జూడో సర్టిఫికెట్లపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని వివరించారు. ప్రస్తుతం హైకోర్టులో ఉన్న ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా డీఎస్సీ నియామకాలు పూర్తయిన ఏడాది తర్వాత దాఖలైందని, దాని పరిధి 2018 నుంచి జరిగిన అన్ని క్రీడా కోటా నియామకాలపై ఉందని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో రాత పరీక్ష మార్కులతో సంబంధం లేకుండా క్రీడాకారుల ప్రతిభకే తొలి ప్రాధాన్యత ఉంటుందని, ఇది రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాధారణ ప్రక్రియ అని స్పష్టం చేశారు. కొందరు క్రీడాకారులపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు ఖండించారు. జాతీయ స్థాయి బాక్సర్ పెద్ద అప్పల రాజు విషయంలో ఆన్‌లైన్‌లో పొరపాటున సోదరుడి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసినా, తర్వాత సరిదిద్దుకున్నారని.. ఆయన పత్రాలన్నీ నిజమైనవేనని వీడియో ఫుటేజ్‌తో సహా నిర్ధారించుకున్నామని తెలిపారు. అలాగే, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీడీపీ ఎమ్మెల్యే కోన రవికుమార్ సంతకం చేయడంపై మాట్లాడుతూ.. జాతీయ సమాఖ్య అధికారికంగా అనుమతి ఇచ్చినందునే ఆయన సంతకం చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధం కాదని స్పష్టం చేశారు.

**టెట్ అర్హతలపై పూర్తి స్పష్టత**

టెట్ అర్హత మార్కుల విషయంలో వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా వివరణ ఇచ్చారు. కర్నూలుకు చెందిన అభ్యర్థి ప్రభాకర్ (బీసీ) టెట్‌లో 77 మార్కులు సాధించి అర్హత పొందారని, దీనిపై మరింత స్పష్టత కోసం సెప్టెంబర్ 5న త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా, జంపాల ఉష (బీసీ) 2012లోనే టెట్‌లో 80 మార్కులతో అర్హత సాధించారని, అప్పట్లో లాంగ్వేజ్ పండిట్లకు ప్రత్యేక టెట్ లేదని, ఆ సర్టిఫికెట్ చెల్లుబాటు అవుతుందని స్పష్టం చేశారు. మిగిలిన అభ్యర్థుల అర్హతలు కూడా నిబంధనల ప్రకారమే ఉన్నాయని వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ రెవెన్యూ శాఖ పరిధిలోని అంశమని, అనుమానం ఉన్న సర్టిఫికెట్లను పునఃపరిశీలన కోసం జిల్లా కలెక్టర్లకు పంపామని తెలిపారు.

# హర్మూజ్ వద్ద 'నిషేధిత జోన్'

ఇరాన్ జాతీయ భద్రతా అధిపతి మొహసెన్ రెజాయ్ వెల్లడించారు. రాబోయే వారం రోజుల్లో ఆ ప్రాంతాన్ని ప్రకటిస్తామన్నారు. అది అమెరికా నౌకా దిగ్బంధన రేఖ నుంచి ప్రారంభమై.. హర్మూజ్ మీదుగా పర్షియన్ గల్ఫ్ వరకు కొనసాగుతుందన్నారు. తాము నిషేధించిన ప్రాంతం మీదుగా వెళ్లే ఏ నౌక అయినా తమ ఆంక్షల జాబితాలో చేరుతుందని రెజాయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధి అమెరికా నియంత్రణలో ఉందని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ చెబుతున్న మాటల్లో నిజం లేదన్నారు. తమ చమురు ట్యాంకర్లను అగ్రరాజ్యం లక్ష్యం చేసుకుంటున్నా.. చమురు ఉత్పత్తి, రవాణా యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. ప్రతిరోజూ 10-15 లక్షల బ్యారెళ్ల చమురును విక్రయిస్తున్నట్లు తెలిపారు. టెహ్రాన్ నుంచి చమురు ఎగుమతులను నిరోధించే లక్ష్యంతో అమెరికా కొన్ని నెలల క్రితం ఇరాన్ ఓడరేవులపై నావికా దిగ్బంధనాన్ని విధించిన సంగతి తెలిసిందే. దీనిని పర్యవేక్షించడానికి 20కి పైగా యుద్ధనౌకలను హర్మూజ్ వద్ద మోహరించింది. ఈ క్రమంలోనే టెహ్రాన్ తాజాగా నిషేధిత జోన్ ఏర్పాటును ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు మళ్లీ ఉద్ధృతమవుతున్నాయి. శనివారం హర్మూజ్‌లో ఇరాన్‌కు చెందిన మూడు చమురు ట్యాంకర్లపై అగ్రరాజ్య సైన్యం దాడులు చేసింది. దీంతో ఇరాన్ కూడా.. ఆదివారం అమెరికా యుద్ధ నౌకలను లక్ష్యం చేసుకుంది.

# యావత్ తెలుగుజాతి ఆస్తి

పయ్యావుల పేర్కొన్నారు. హైటెక్ సిటీ ఏర్పాటుకు ముందే వందల సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేసి మానవ వనరులను సిద్ధం చేశారని, అందుకే ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువతకు ఐటీ ఉద్యోగాలు వెంటనే లభించాయని వివరించారు. ఆయన ప్రణాళిక వల్లే నేడు ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఐటీ నిపుణులుగా అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్నారని అన్నారు. జలవనరుల నిర్వహణలో చంద్రబాబును 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించారు. పట్టిసీమ ద్వారా 500 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించి, ప్రకాశం బ్యారేజీని 200 సార్లు నింపిన ఘనత చంద్రబాబుదేనని ప్రశంసించారు. 2024లో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నారని అన్నారు. నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్‌లను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఈ విషయంలో నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తూ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నామని పయ్యావుల తెలిపారు. నేతలంతా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# సీఎం అభ్యర్థి నేను కాదు

పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

# మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం : కేటీఆర్

వదిలిపెట్టం. హోంమంత్రిగానూ ఉన్న రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే. ఈ అంశాన్ని ఇక్కడితో వదిలిపెట్టం.. జాతీయ మహిళా కమిషన్ దగ్గరకూ వెళ్తాం. ప్రజా సమస్యలు చాలా ఉన్నాయి.. అసెంబ్లీని నెలరోజులు నిర్వహించాలి. సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వను అనడమేంటి? స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టే అంశంపై ఆలోచిస్తాం" అని కేటీఆర్ అన్నారు.

# ఇంత అవమానం?: మంత్రి సీతక్క

అధ్యక్షా అనాల్సి వస్తుందనే ఆయన అసెంబ్లీకి రావడం లేదు. గతంలో సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఉంటే ఓర్వలేక ఆయన్ను తొలగించారు. గతంలో జగదీశ్‌రెడ్డి కూడా ఇదే తరహాలో మాట్లాడారు. స్పీకర్ తల్లిని అవమానించడం బాధాకరం. ఆయన ఉన్నత స్థాయికి వెళ్లినందుకు తల్లిని అవమానించాలా?అట్టడుగు వర్గాల బిడ్డలమనేనా.. మనకింత అవమానం? "అంటూ సీతక్క ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

# ఇస్రో ప్రైవేటీకరణ ఉండదు

ఎక్స్‌పోలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పరిశ్రమల పాత్ర కొత్తదేమీ కాదని నారాయణన్ పేర్కొన్నారు. విస్తృత బాధ్యతలు చేపట్టేలా ఇస్రో మరింత శక్తిమంతంగా మారుతుందన్నారు. ప్రస్తుతం సుమారు 450 పరిశ్రమలు ఇస్రోతో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. దేశ అవసరాలకు ఏటా దాదాపు 50 లాంచ్ వెహికిల్స్ అవసరమని.. ఆ స్థాయిలో ప్రయోగ సామర్థ్యాన్ని పెంచాలంటే ఇస్రోతో పాటు మరింత విస్తృత వ్యవస్థ కీలకమన్నారు.

# లంచాలను ఈఎంఐల్లాగా ఇవ్వాల్సి వచ్చింది

7.5 శాతం నుంచి 10 శాతం వరకు వసూలుచేశారని ఈడీ పత్రాల ద్వారా వెల్లడవుతోంది. అధికారంలో ఉన్న పార్టీ కోసం ఈ లంచాలు తీసుకున్నారు. అప్పుడు అధికారంలో ఉన్నది డీఎంకేనే కదా..! ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ తదితర కీలక నేతలు వసూళ్ల సొమ్ముకు ప్రత్యక్ష లబ్ధిదారులు" అని విజయ్ విమర్శించారు.


**కరూర్ గ్యాంగ్.. గొప్ప పేరు**

కరూర్, కోయంబత్తూర్, ఇతర జిల్లాల్లోని బార్ యజమానుల నుంచి రాజకీయ నాయకులు డబ్బు వసూలు చేయడాన్ని ఈడీ తన నివేదికలో కరూర్ గ్యాంగ్ (ఖుతీబతీ స్త్రుఖఅస్త్ర)గా పేర్కొంది. విజయ్ (ఎఱఖుఎ) దానిని ఉటంకిస్తూ మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై విమర్శలు చేశారు. ఆయన వ్యవస్థీకృత అవినీతి నెట్‌వర్క్‌కు కేంద్రంగా ఉన్నారన్నారు. డీఎంకే ఉన్నచోటల్లా తప్పులు జరుగుతుంటాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కరూర్ గ్యాంగ్ ఈ పేరు ఎంత గొప్పగా ఉంది. దీనికి నాయకుడు ఎవరు..? మనకే ఇంత ఆత్రుతగా ఉంటే.. సామాన్యులకు ఈ విషయంలో ఇంకెంత ఆత్రుత ఉంటుందో ఊహించుకోండి" అని పేర్కొన్నారు. ఈ అవినీతి ఆరోపణలపై డీఎంకే నేతలు స్పీకర్ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ పార్టీ నేత ఉదయనిధి స్టాలిన్ ఆరోపణలను తిప్పికొట్టారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన సమస్యలపై మాట్లాడకుండా.. ప్రజల దృష్టి మరల్చేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని దుయ్యబట్టారు.

# నెల్లూరులో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఘనస్వాగతం

**స్వర్ణ భారత్ ట్రస్ట్ రజతోత్సవాలకు హాజరైన యూపీ సీఎం యోగి**
**నెల్లూరులో ఘన స్వాగతం పలికిన మంత్రులు నారాయణ, సత్యకుమార్**
**అక్షర విద్యాలయంలో నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని పరిశీలన**
**శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించిన ఆదిత్యానాథ్**
**ట్రస్ట్ సేవలను, విద్యాసంస్థల నిర్వహణను ప్రశంసించిన యూపీ సీఎం**

నెల్లూరు, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సోమవారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవ (రజతోత్సవ) వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, వై. సత్యకుమార్ సాదరంగా స్వాగతం పలికారు. అక్షర విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన యోగికి మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, కుమారుడు హర్షవర్ధన్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం యోగి అక్షర విద్యాలయం ప్రాంగణంలో ఉన్న సోమా సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతీయువకులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. వారికి అందుతున్న సాంకేతిక శిక్షణ, భవిష్యత్ అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణ భారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను, అక్షర విద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషిని యోగి ఆదిత్యానాథ్ ప్రశంసించారు. ప్రాంగణంలో విద్యార్థులు నిర్వహించిన స్కేటింగ్ ప్రదర్శనను కూడా ఆయన ఆసక్తిగా తిలకించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య



నాయుడు స్ఫూర్తితో 2001లో ఏర్పాటైన స్వర్ణ భారత్ ట్రస్ట్, గ్రామీణ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తూ 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా యోగి ఆదిత్యానాథ్ భోజనానంతరం ట్రస్ట్ ప్రాంగణానికి చేరుకుని, అక్కడ నిర్వహిస్తున్న ఇతర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారు. అనంతరం ప్రజా మందిరంలో జరిగే ప్రధాన సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారు. ఆయన పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

### గాల్లో ఉండగా..

# విమానం ఇంజిన్‌లో తగ్గిపోయిన ఆయిల్

**సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఓ విమానం గాల్లో ఉండగా ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఈ విమానం సోమవారం ఉదయం కేరళలోని కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అబుధాబికి బయల్దేరింది. టేకాఫ్ అయిన సుమారు 50 నిమిషాల తర్వాత.. మొదటి ఇంజిన్‌లో ఆయిల్ తగ్గడాన్ని పైలట్లు గుర్తించారు. ఆయిల్ ప్రెజర్ ప్రమాదకర స్థాయికి చేరడంతో వెంటనే ఆ ఇంజిన్‌ను ఆపివేశారు. మిగిలిన ఒకే ఇంజిన్‌తో ప్రయాణం కొనసాగించడం కష్టం కావడంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఒకే ఇంజిన్‌తో 45నిమిషాల పాటు ప్రయాణించిన ఆ విమానం పైలట్ల అప్రమత్తతో సురక్షితంగా కొచ్చి విమానాశ్రయంలో దిగింది. దీనిపై విమానయాన సంస్థ స్పందించింది. ఘటనకు దారి తీసిన పరిస్థితులపై అంతర్గత విచారణ కొనసాగుతోందని తెలిపింది. మరోవైపు ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు చేపట్టాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సంబంధిత అధికారులను ఆదేశించింది.

**అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద డ్రోన్‌ల కలకలం..**

అమృత్‌సర్ ఎయిర్‌పోర్టు వద్ద అనుమానాస్పద డ్రోన్‌లు కలకలం సృష్టించాయి. ఈ విమానాశ్రయం భారత్- పాక్ సరిహద్దులకు సమీపంలో ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా ఏడు విమానాలను దారి మళ్లించామని.. కొన్ని గంటలపాటు ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలను నిలిపివేశామని వెల్లడించారు. విమానాశ్రయ ప్రహరీ గోడ వెలుపల పలు డ్రోన్లు అనుమానాస్పదంగా ఎగురుతూ కనిపించినట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వెల్లడించింది.

# మళ్లీ బద్దలైన అగ్నిపర్వతం.. 1.7 లక్షల ప్రయాణికులపై ఎఫెక్ట్

**సెప్టెంబర్ 07, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండోనేసియాలోని సుందా జలసంధిలో ఉన్న అనక్ క్రాకటా అగ్నిపర్వతం మరోసారి బద్దలయ్యింది. దాని నుంచి భారీ ఎత్తున బూడిద వెలువడుతుండటంతో ఆ సమీప ప్రాంతంలో విమానాల రాకపోకలకు అంతరాయం కొనసాగుతోంది. శుక్రవారం నుంచి క్రియాశీలకంగా ఉన్న ఈ అగ్నిపర్వతం మొదట ఆదివారం తెల్లవారుజామున బద్దలైంది. అర్ధరాత్రి సమయంలో కూడా మరో రెండు సార్లు అందులో పేలుళ్లు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. దట్టమైన పొగ, బూడిద కమ్మేయడంతో దేశవ్యాప్తంగా 8 విమానాశ్రయాలను మూసివేశారు. దీంతో 1.7 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడింది. మరోవైపు, సుందా జలసంధిలో ప్రయాణించే నౌకలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అగ్నిపర్వతం చుట్టూ 3 కిలోమీటర్ల మేర నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. ఆ ప్రాంతంలోకి వెళ్లొద్దని స్థానికులు, పర్యాటకులకు ఆదేశాలు జారీ చేశారు. జకార్తా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలను మూసివేశారు. గత రెండు రోజులుగా విమానాలు రద్దవడంతో విమానాశ్రయాల్లో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఆదివారం 746 దేశీయ, 272 అంతర్జాతీయ విమానాల సర్వీసులు రద్దయ్యాయి. సోమవారం 8 విమానాశ్రయాల్లో కలిపి మొత్తం 1,500కు పైగా విమాన రాకపోకలను నిలిపివేశారు.

# ఎడిటర్ వాయిస్

## బ్యాలెట్‌తోనే లోకల్ ఫైట్

స్థానిక సంస్థలకు బ్యాలెట్ పేపర్లే ఎపుడూ ఉపయోగిస్తూంటారు. అయితే ఈసారి ఈవీఎంలను ఉపయోగించాలని మొదట నిర్ణయించారు.

ఈవీఎంల మీద విపరీతమైన అనుమానాలు వ్యక్తం చేస్తూ ఉంటుంది ప్రతిపక్షం. గెలిస్తే అవి ఓకే. ఓడితే మాత్రం ఈవీఎంల ట్యాంపరింగ్ అని పడికట్టు విమర్శలు చేస్తూ ఉంటారు. దాంతో బ్యాలెట్ పేపర్ తోనే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూంటారు. ఏపీ ఎన్నికల సంఘం అయితే బ్యాలెట్ తోనే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని చూస్తోంది. దాంతో ఈవీఎంల ప్లేస్ లో బ్యాలెట్ పత్రాలే ఈసారి కనిపించబోతున్నాయి. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు అంటే ఏపీలో లోకల్ బాడీ ఎన్నికల్లో ఉపయోగించడానికి సరిపడనన్ని ఈవీఎంలు లేకపోవడం వల్లనే అని అంటున్నారు.

**ఈవీఎంలు ఉపయోగించాలని :**

స్థానిక సంస్థలకు బ్యాలెట్ పేపర్లే ఎపుడూ ఉపయోగిస్తూంటారు. అయితే ఈసారి ఈవీఎంలను ఉపయోగించాలని మొదట నిర్ణయించారు. దాంతో అవసరమైన ఈవీఎంల కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూడా రప్పించాలని అనుకున్నారు. కానీ ఏమి జరిగిందో ఏమో చివరికి బ్యాలెట్ పేపర్ల అని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలో మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు వంటి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడానికి ఎన్నికల సంఘం తగిన ఏర్పాట్లు చేస్తోందని అధికారులు చెబుతున్నారు.

**బ్యాలెట్ పేపర్ అయితే :**

నిజానికి ఈవీఎంలు అయినా బ్యాలెట్ పేపర్ అయినా కూడా ప్రజాభిప్రాయం ఎలా ఉంటే అలాగే ప్రతిబింబిస్తుంది. ఈ మధ్యనే కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికను బ్యాలెట్ పేపర్ మీదనే నిర్వహించారు. అయినా ఫలితం అధికార తెలుగుదేశం పార్టీకి అనుకూలంగానే వచ్చింది. ఈవీఎంలు అయితే ట్యాంపరింగ్ అన్న విమర్శలు చేసే వారు కూడా బ్యాలెట్ పేపర్ కావడంతో ఎవరూ దీని మీద చేయలేకపోయారు. దాంతో ఇపుడు కూడా బ్యాలెట్ పేపర్ వినియోగమే చేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది.

**ప్రజా తీర్పు స్పష్టం :**

ఏ సాధనం అయినా ఓటు అనేది జనాలు వేస్తారు, కాబట్టి ప్రజా తీర్పు స్పష్టంగా ఉంటుందనే మేధావులు ప్రజాస్వామ్య ప్రియులు అంటున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు అంటే కొంత వ్యక్తిగతంగా తీసుకునే చాన్స్ ఉంటుంది. అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో నిర్వహించాలని అంతా కోరుతున్నారు. అదే విధంగా సున్నితమైన ప్రాంతాలు వివాదాలు గొడవలు చోటు చేసుకుంటాయి అన్న చోట గట్టిగా బందోబస్తు ఉండాలని కూడా అంటున్నారు. ఇక బ్యాలెట్ పేపర్ వల్ల ఫలితాలు రావడానికి ఆలస్యం అవుతుంది అని కూడా ఉంది. అయితే ట్రెండ్ అన్నది తెలిసిపోతుంది కాబట్టి ఉత్కంఠ ఉన్నా ఇబ్బంది అయితే లేదని అంటున్నారు. మొత్తానికి బ్యాలెట్ పేపర్ వినియోగం అన్ని రాజకీయ పక్షాలకు అంగీకారమే అవుతుందని అంటున్నారు. ఇక్కడ కూడా సవ్యంగా ఎన్నికలు జరగలేదు అని అంటే మాత్రం ఆలోచించాల్సిందే మరి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## కారులో చెలరేగిన మంటలు.. వ్యక్తి సజీవదహనం



**దుండిగల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కారులో మంటలు చెలరేగడంతో అందులో ఓ వ్యక్తి సజీవదహనమయ్యాడు. తీవ్ర కలకలం సృష్టించిన ఈ ఘటన దుండిగల్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బౌరంపేట అవుటర్ సర్వీస్ రోడ్డుకు పక్కన ఓ విల్లా గేటెడ్ కమ్యూనిటీలో కార్తీక్ (40) అనే వ్యక్తి నివాసముండేవాడు. అదే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల గృహ సముదాయం సమీపంలోని రోడ్డుపైన సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో కారులో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న కార్తీక్ (40)సజీవ దహనమయ్యాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదవశాత్తు ఘటన జరిగిందా లేదా ఇతర కారణాల అనేది తెలియాల్సి ఉంది.

## ఉద్యోగాల పేరిట మోసం.. ఎమ్మెల్యే పీఏ అరెస్ట్

**భద్రాచలం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉద్యోగాల పేరిట మోసం చేసిన భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కల్యాణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం వాసి రాయల శ్రీను ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. నిరుద్యోగుల నుంచి సుమారు రూ.8కోట్లు వసూలు చేసినట్లు కల్యాణ్‌పై ఆరోపణలు ఉన్నాయి. 54 మందిని ఆయన మోసం చేసినట్లు సమాచారం. బెట్టింగులకు అలవాటుపడి కల్యాణ్ డబ్బు పోగొట్టుకున్నట్లు సమాచారం.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**మహబూబాబాద్ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ అవసరాలు, వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరగడంతో తీర్చే మార్గం తోచక మనస్తాపం చెందిన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మహబూబాబాద్ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం... అయోధ్య గ్రామానికి చెందిన సామకూరి వెంకన్న(50) తనకున్న ఎకరంతోపాటు మరో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. నాలుగున్నర ఎకరాల్లో వరి, అరెకరంలో కూరగాయలు, మరో ఎకరలో మిరప వేశారు. రెండేళ్లుగా పంట దిగుబడి సరిగా రావడం లేదని..ఇంటి అవసరాల కోసం, పంట పెట్టుబడికి తెచ్చిన అప్పులు పెరిగాయి. వాటిని తీర్చేందుకు కుమారుడి ఇంటి పేరిట రూ.8 లక్షలు బ్యాంకులో రుణం తీసుకోగా..మరికొందరి వద్ద రూ.6 లక్షల వరకు అప్పు చేశారు. మొత్తంగా రూ.14 లక్షల అప్పు అయిందని తరచూ మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం వెంకన్న ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అతని కుమారుడు సామకూరి పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై రాజు తెలిపారు.

### భర్త వీడియోకాల్‌కు స్పందించలేదని

## వివాహిత ఆత్మహత్య

**నెహ్రూసెంటర్, విశ్వం వాయిస్ న్యూస్ :** వీడియోకాల్‌కు భర్త స్పందించలేదని మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ పట్టణంలోని హస్తినాపురం కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామానికి చెందిన ధారవత్ శారద కుమార్తె అఖిలను అదే గ్రామానికి చెందిన బానోత్ హుస్సేన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. హుస్సేన్ ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ ఏడాది నుంచి మహబూబాబాద్ పట్టణంలోని హస్తినాపురం కాలనీలో ఉంటున్నారు. వీరికి ఆరు నెలల పాప ఉంది. ఈ నెల 2వ తేదీన ఉదయమే అఖిల తన పుట్టింటికి వెళ్లారు. చేరుకోగానే అక్కడి నుంచి భర్తకు వీడియో కాల్ చేయగా ఆయన స్పందించలేదు. దీంతో ఆమె మనోవేదనకు గురై అదే రోజు హస్తినాపురం వచ్చి క్షణికావేశంలో ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన భర్త వెంటనే మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈ విషయమై మృతురాలి తల్లి శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై బషీరుద్దీన్ కేసు నమోదు చేపట్టినట్లు ఇన్‌ఛార్జి సీఐ అంజలి తెలిపారు. అనంతరం కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

### ఫుట్‌బోర్డు గొడవకు

## నిండు ప్రాణం బలి



**మథుర, విశ్వం వాయిస్ న్యూస్ :** క్షణికావేశంలో ఉద్రేకానికి గురై తీసుకున్న నిర్ణయం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఉత్తర్ ప్రదేశ్‌లోని హాథ్రస్‌లో జతిన్ (22) అనే యువకుడు శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి కాస్‌గంజ్- మథుర ప్యాసింజరు రైలెక్కాడు. రైలు రాయా స్టేషన్‌ను సమీపిస్తుండగా.. ఫుట్‌బోర్డువద్ద కూర్చునే విషయమై సహ ప్రయాణికుడు గజేంద్రతో గొడవ జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన గజేంద్ర కదులుతున్న రైలు నుంచి జతిన్‌ను కిందికి తోసేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.



# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు







### అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను

# ఖండిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం

## హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని దళిత ప్రజా సంఘాలు డిమాండ్



**కాకినాడ, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అవమానకర రాతలు,నీచమైన కుట్రలకు పాల్పడుతున్న హమారా ప్రసాద్ పై తక్షణమే అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం కాకినాడ లో సుందరయ్య భవన్ లో రిటైర్డ్ ఇంజనీర్ పిల్లి రామారావు అధ్యక్షతన వివిధ దళిత, అంబేడ్కర్ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యం లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అయితాబత్తుల రామేశ్వరరావు, డాక్టర్ భానుమతి, పి. పావన ప్రసాద్, కెవిస్ శ్రీనివాస్, దువ్వ శేషబాబ్జి, కుమార్ బాబు, జె. వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ప్రపంచం మెచ్చిన మహా మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలను, రాజ్యాంగ విలువలను కించపరిచే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేయడం సమాజంలో అశాంతికి దారితీస్తుందన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, తప్పుడు రాతలు రాస్తున్న హమారా ప్రసాద్ ను వెంటనే అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. భావితరాలకు అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ స్ఫూర్తిని చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. డోకుబుర్ర భద్రం, సబ్బతి ఫణీశ్వరరావు, సవిలే రాజేష్, ఎం రాజశేఖర్, నేలపాటి ప్రసాద్, కొండలరావు, తాడి బాబ్జి, థామస్, వరప్రసాద్, దడాల అబ్బులు, కుంచె సూర్యనారాయణ, లోవరాజు, మణికంఠ, మెల్లిమి డేవిడ్ రాజు, బి. రత్నం, సోమేశ్వరరావు, కె. సత్తిరాజు, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, తాడి ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, డి. నాగేశ్వరరావు, వల్లు రాజుబాబు, పలివెల వీరబాబు తదితర నాయకులు, దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని అంబేద్కర్ ఆశయాలకు రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సెప్టెంబర్ 11 వ తేదీన జిల్లా కలెక్టర్ మరియు ఎస్.పి. లకు వినతి పత్రాలు సమర్పించాలని తీర్మానించారు

### మున్సిపల్ ఎన్నికల బరిలో దిగే

# టిడిపి అభ్యర్థుల ఎంపిక కసరత్తు

## గెలుపు గుర్రాలకే సీట్లు ఇస్తామన్న పట్టణ టిడిపి అధ్యక్షురాలు శోభారాణి



**కోటనందూరు, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు తుని పట్టణ తెలుగు దేశం పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తుకు శుభారంభం పలికి పట్టణ తెలుగు దేశం పార్టీ వార్ వన్ సైడే అవుతుం దని ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రజాభిమానం దండిగా ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి గెలుపు గుర్రాల ఎన్నికల బరిలో నిలపాలని టీడీపీ నేతలు శ్రేణులు పిలుపు నిచ్చారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ పర్య వేక్షణలో టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి అధ్యక్షతన పట్టణ తెలుగు దేశం పార్టీ ఎన్నికల శంఖారావం పూరించింది. ఎమ్మెల్యే యనమల దివ్య వివక్షత లేని రాజకీయం వల్ల వార్డుల అభివృద్ధి పురోభివృద్ధి, అసాంఘిక శక్తులు ఆటకట్టించడంతో వర్తక వాణిజ్య వర్గాలు ప్రశాంత స్వేచ్ఛాయుత వాతావరణం పట్టణంలో ఆవిష్కృతం అయిందని వివరించారు.ఈనేపథ్యంలో పట్టణ ఓటర్లంతా కూటమి పక్షానే ఉన్నారని పేర్కొన్నారు. అయినంత మాత్రాన గెలుపు గుర్రాలను అందుకునే బలమైన అభ్యర్థులను బరిలోకిదింపాలన్న అధిష్టానం పిలుపు మేరకు రిజర్వేషన్ల సీట్లు పోగా మిగతా స్థానాల నుంచి ప్రధాన సామాజిక వర్గాల నుంచి అభ్యర్థుల ఎంపిక ఉండాలని సూచించారు.పైరవీలుకు చోటు లేదని సమర్థులయిన అభ్యర్థులను ఎంపిక చేయాల్సిన బాధ్యత వార్డు కమిటీపైనే ఉందన్నారు. వార్డు కమిటీలు ప్రతిపాదించిన పేర్లను అధిష్టానం స్టీరింగ్ కమిటీ పూర్తి కసరత్తు చేసిన తర్వాత తుది జాబితా విడుదల అవుతుందని తేల్చి చెప్పారు.అధిష్టానవర్గం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని అభ్యర్థి ఎవరైనా విజయ సునామీ సృష్టించాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, సీనియర్ నేత మోతుకూరి వెంకటేష్,గవర కార్పోరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్, టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి సూరంపూడి చంద్రశేఖర్,పాతబజారు వీధి వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మెన్ కుక్కడపు బాలాజీ,గాంధీ సత్రం చైర్మన్ కుండల రామకృష్ణ,కారుమూరి భద్రరావు,పరవాడ తాత బాబు, గుడివాడ అప్పలనాయుడు, దంతులూరి శ్రీనివాసరాజు, బోడపాటి అప్పారావు, కూరపాటి రఘు, సిద్ధాంతపు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# గురువులే భావితరాలకు దిక్సూచి!

## విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
## మమత స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.. పలువురు గురువులకు ఘన సన్మానం

**పిఠాపురం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు వారిని ఉన్నత విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమని మమత స్కూల్ కరస్పాండెంట్ కట్టా నాగేశ్వరరావు అన్నారు. సమాజానికి మంచి పౌరులను అందించడంలో గురువులు పోషిస్తున్న పాత్ర ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పిఠాపురంలోని మమత స్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గురువుల పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

**విద్యారంగానికి రాధాకృష్ణన్ సేవలు ఆదర్శప్రాయం**

కార్యక్రమానికి రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు ఎస్. జ్ఞానేశ్వరరావు, రిటైర్డ్ పీఈటీ ఝాన్సీ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంతో పాటు వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక స్పృహను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. మమత స్కూల్ కరస్పాండెంట్ కట్టా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందని అన్నారు. గురువుల బోధన, మార్గదర్శకత్వాన్ని గౌరవిస్తూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.

**గురువులకు ఘన సన్మానం..**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ పిఠాపురం ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మమత స్కూల్ కరస్పాండెంట్ కట్టా నాగేశ్వరరావు సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు. సమాజంలో ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం



అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన వాసవి క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సన్మానం పొందిన వారిలో మల్లికార్జున్, గజేశ్వరరావు, సతీష్, చైతన్య, మౌళి, నూతన్, ఐఈసీ సతీష్, గంగాధర్, మనేరావు, సుధాకర్‌రెడ్డి, పార్థసాయి తదితరులు ఉన్నారు.

**వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయ బృందం**

కార్యక్రమంలో మమత స్కూల్ ఉపాధ్యాయులు సంతోషి, మీరాబీబీ, వరలక్ష్మి, ఉమాదేవి, జ్యోతి, సీతాదేవి, వీరలక్ష్మి, భాగ్యరేఖ, లోవ, డి. లలిత, శ్రీలక్ష్మి, సలోమి, సరస్వతి, వెంకటలక్ష్మి, శివజ్యోతి, నాగసత్యవేణి, నాగిని, సునీత, సీతామహాలక్ష్మి, ఝాన్సీ, మాధవి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. గురువుల సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపింది. “గురువే జ్ఞానానికి మార్గం.. భావితరాల విజయానికి బాట” అనే సందేశంతో వేడుకలు ఉత్సాహంగా ముగిశాయి.

# ప్రజల సహకారంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

## స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ బి.సునీల్ కుమార్ రెడ్డి



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యకర వాతావరణ నిర్మాణం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజల సహకారం, మద్దతు ఎంతో అవసరమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ బి.సునీల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరపాలక కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. 17 వ వార్డు ఐఓసీ వద్ద ఉన్న జీటీఎస్(గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా నగరంలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల(జీవీపీ)ను ఆర్ఆర్ఆర్(రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్) సెంటర్ సాయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నాన్ని అభినందించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ 2026 గైడ్ లైన్స్ ను తప్పక పాటించాలని, ఘన వ్యర్థాల నిర్వహణను పక్కాగా నిర్వహించాలని సూచించారు. లెగసీ వ్యర్థాలను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును సందర్శించారు. బయో రెమిడియేషన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించి.. ఏజన్సీకి పలు సూచనలు చేశారు. తదనంతరం నగర పారిశుధ్యాన్ని పర్యవేక్షించారు. 11 వ వార్డు వీఎల్ పురంలో డోర్ టూ డోర్ చెత్త సేకరణను పరిశీలించి.. వెహికల్ మూవ్ మెంట్, యాక్షన్ ప్లాన్ ను అడిగి తెలుసుకున్నారు. ఘన వ్యర్థాలను మూలం వద్దే తడి-పొడి వ్యర్థాలుగా వేరు చేసి సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్ ప్లాంట్లలో శుద్ధి చేయడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర అంటే పరిసరాలు పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమని.. ప్రజలు పూర్తిగా సహకరిస్తేనే స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. పర్యటనలో ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఇతర పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.






# వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు సులభతరం చేయాలి

## సింగిల్ విండో విధానంలో కాలపరిమితిలో అనుమతులు ఇవ్వాలి
## ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడీ కేటాయించి జాప్యం నివారించాలి - కలక్టరేట్ పీజీఆర్ఎస్‌లో 'జనతా వారధి' బృందం వినతి



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతుల ప్రక్రియ సులభతరం చేసి, సింగిల్ విండో విధానంలో నిర్ణీత కాలపరిమితిలో అనుమతులు మంజూరు చేయాలని బిజెపి జనతా వారధి బృందం కోరింది. ఈమేరకు జిల్లా కలక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తనుబుద్ధి సూర్య భాస్కరరావు, జనతావారధి కో-కన్వీనర్ యానాపు ఏసు, బీజేపీ సీనియర్ నాయకులు అడపా వరప్రసాద్, బొరుసు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, గొల్లగాని భాస్కరరావు, ఆర్టీసీ మూర్తి, కొత్త దేవి భవానీ, జొన్నలగడ్డ శ్రీనివాస్, తదితరులు వినతి పత్రం సమర్పించారు. వినాయక చవితి ఉత్సవాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని, పూర్తి వివరాలతో దరఖాస్తు సమర్పించిన ఉత్సవ కమిటీకి గరిష్ఠంగా 48 గంటల్లో అనుమతి మంజూరు చేయాలని కోరారు. ఎలాంటి అనవసర ఇబ్బందులు కలగకుండా, అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజలకు అనుకూలంగా అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడీ కేటాయించి, అది ప్రస్తుతం ఏ శాఖ, ఏ అధికారి వద్ద ఉందో ఆన్‌లైన్‌లో తెలుసుకునే సదుపాయం కల్పించాలని, అదేవిధంగా మౌఖికంగా అభ్యంతరాలు చెప్పి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, ఏ నిబంధన ప్రకారం అనుమతి నిరాకరిస్తున్నారో లిఖితపూర్వకంగా స్పష్టంచేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ నుంచి పోలీస్ స్టేషన్‌కు నిబంధనలు మారకుండా అన్నిచోట్లా ఒకే విధమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించని రుసుములు, విరాళాలు, 'మామూలు' లేదా ఇతర అనధికారిక చెల్లింపులను ఉత్సవ కమిటీల నుంచి డిమాండ్ చేయకుండా కఠినమైన ఆదేశాలు ఇవ్వాలని, అక్రమంగా డబ్బు డిమాండ్ చేసిన అధికారులపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. అనుమతుల కోసం ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని, ఉత్సవ కమిటీల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు.






# టీడీపీ గ్రామ అధ్యక్షురాలి పాడె మోసిన వాసంశెట్టి సత్యం

## టీడీపీ కార్యకర్త కష్టాల్లో అండగా.. కన్నీటి వీడ్కోలులో తోడుగా
## కార్యకర్తల కుటుంబాలు మా కుటుంబాలే.. వారి కష్టాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటాం
## తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం



**కె.గంగవరం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తల కష్టసుఖాల్లో అండగా నిలవడమే నిజమైన మానవత అని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం కార్యరూపంలో నిరూపించారు. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షురాలు శీరెడ్డి సాయి రామలక్ష్మి ఆకస్మిక మృతి పట్ల మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యమైన సమావేశాల్లో అమరావతిలో ఉన్నందున, ఆయన ఆదేశాల మేరకు వాసంశెట్టి సత్యం సుందరపల్లికి వెళ్లి సాయి రామలక్ష్మి భర్త, సీనియర్ టీడీపీ కార్యకర్త శీరెడ్డి సత్తిబాబు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం సాయి రామలక్ష్మి భౌతికకాయంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి, పాడె మోసి పార్టీ తరఫున గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు పలికారు. పార్టీ కోసం సేవలందించిన కార్యకర్తకు చివరి వరకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని వాసంశెట్టి సత్యం తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్త మా కుటుంబ సభ్యుడే. కార్యకర్త సంతోషంలో మాత్రమే కాదు.. కష్టంలోనూ, కన్నీటిలోనూ మేము తోడుగా ఉంటాం. కార్యకర్తల కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా వారికి అండగా నిలుస్తాం అని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. సాయి రామలక్ష్మి మృతి పార్టీకి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, సలాది శ్రీను, తడాల జానకిరామ్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు పాల్గొని సాయి రామలక్ష్మికి ఘన నివాళులర్పించారు.

### బాధితుల సమస్యలకు
# సత్వర న్యాయమే ప్రాధాన్యత

## జిల్లా ఎస్పి రాహుల్ మీనా



**అమలాపురం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించి, చట్టపరిధిలో న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ తెలిపారు. ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం అమలాపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తేతో కలిసి బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 30 ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలపై బాధితులు ఫిర్యాదులు అందజేశారు. అందిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను
# పకడ్బందీగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం అంబాజీపేట మండలం కే. పెదపూడి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, పార్కింగ్, వైద్య, అగ్నిమాపక తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి, శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని ఆదేశించారు. హెలీప్యాడ్, సభా వేదిక, ప్రభుత్వ స్టాళ్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమావేశ ప్రాంతాలకు వేర్వేరుగా ప్రత్యేక అధికారులను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఆయా అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, మంగళవారం మధ్యాహ్నానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సభకు హాజరయ్యే ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులను ఆదేశించారు. సభా సమయానికి 45 నిమిషాల నుంచి గంట ముందు మాత్రమే ప్రజలను వేదిక వద్దకు చేర్చాలని, ఎక్కువసేపు ఎండలో వేచి ఉండే పరిస్థితి కల్పించవద్దని సూచించారు. ప్రజలకు తాగునీరు, అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలకు, సాధారణ ప్రజల వాహనాల రాకపోకలకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌కు స్పష్టమైన ప్రదేశాలను గుర్తించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన బారికేడింగ్, పటిష్టమైన భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. హెలీప్యాడ్ వద్ద ఏర్పాటు చేసే మెష్ బారికేడింగ్ పనులను పక్కాగా పూర్తి చేసి భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సభా వేదిక, హెలీప్యాడ్ వద్ద అత్యాధునిక అంబులెన్సులు, సరిపడా వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ తగినన్ని ఫైర్ ఇంజిన్లను సిద్ధంగా ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పర్యటన ఏర్పాట్ల పేరుతో పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భారీ వృక్షాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని, ఏర్పాట్లకు అవరోధంగా ఉన్న చిన్నపాటి పొదలను మాత్రమే అవసరమైన మేరకు తొలగించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను శాఖల వారీగా సమన్వయం చేసుకుంటూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, అంబాజీపేట తహసీల్దార్ చిన్నబాబు, వైద్య శాఖ అధికారి దుర్గారావు, అగ్నిమాపక శాఖ అధికారి పార్థసారథి, రవాణా శాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఆర్టీసీ అధికారి సత్యనారాయణమూర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య!

## రావులపాలెంలో సంచలనం రేపిన విషాదం



**రావులపాలెం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** చీటీల రూపంలో సేకరించిన డబ్బులు అప్పుగా ఇచ్చి, అవి తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై భార్యాభర్తలు ప్రాణాలు తీసుకున్న ఘటన రావులపాలెం కొత్త కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రావులపాలెం కొత్త కాలనీకి చెందిన కర్రి వెంకట నాగేశ్వరరెడ్డి (50), ఆయన భార్య దుర్గా లక్ష్మి (42)లు కొన్నేళ్లుగా స్థానికంగా చీటీల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా వారు చీటీల ద్వారా వసూలు చేసిన పెద్ద మొత్తంలో డబ్బులను ఓ మహిళకు అప్పుగా ఇచ్చారు. అయితే సదరు మహిళ ఇచ్చిన గడువు ముగిసినా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురయ్యారు. చీటీల డబ్బులు కట్టిన వారి నుంచి ఒత్తిడి పెరగడం, ఇచ్చిన అప్పు తిరిగి రాకపోవడంతో గత కొంతకాలంగా తీవ్ర మనస్తాపంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో దంపతులిద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న రావులపాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఘటనపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషాద ఘటనతో కొత్త కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

# మంగళగిరిలో టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సెప్టెంబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న అత్యున్నత స్థాయి లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య ప్రసంగాలు చేశారు. ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, పొలిట్‌బ్యూరో సభ్యులు, జోనల్ ఇన్‌చార్జ్‌లతో కలిసి ఆనందరావు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమ పథకాల అమలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై పార్టీ నాయకత్వంతో చర్చించారు.

# గోదావరి జలాలను నిలిపివేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

## శ్రీ సత్యసాయి వాటర్ సప్లై వెంటనే పునరుద్ధరించాలి
## ఆర్ & ఆర్ కాలనీలతో పాటు అన్ని ప్రభావిత ప్రాంతాలకు తాగునీరు అందించాలి : పిడిఎస్‌యు డిమాండ్



**గోకవరం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :**గోకవరం మండలంలోని ఆర్ & ఆర్ కాలనీలు, పలు గ్రామాలు మరియు ఇతర ప్రాంతాలకు శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ద్వారా అందుతున్న తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి జలాలను ప్రజలకు అందించలేని ప్రభుత్వం ఎందుకు? ప్రజలకు తాగునీరు అందించడం కూడా చేతకాని పాలన ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సరైన తాగునీరు అందకపోవడం వల్ల ప్రజలు కలుషిత నీటిపై ఆధారపడి వ్యాధుల బారిన పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆర్ & ఆర్ కాలనీలలో నివసిస్తున్న పేద, నిర్వాసిత కుటుంబాలపై ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ దయ కాదు - అది ప్రజల హక్కు. ఆ హక్కును కాలరాస్తే ాణుాఖ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. మరోవైపు శ్రీ సత్యసాయి వాటర్ సప్లైలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు జీతాలు చెల్లించకుండా నెలల తరబడి ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. ప్రజలకు నీరు అందించే ఉద్యోగుల కుటుంబాలే జీతాల కోసం ఎదురు చూసే పరిస్థితి రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

**పిడిఎస్‌యు ప్రధాన డిమాండ్లు:**

శ్రీ సత్యసాయి వాటర్ సప్లైను తక్షణమే పునరుద్ధరించాలి.

గోదావరి జలాల సరఫరాను వెంటనే పునరుద్ధరించి నిరంతరాయంగా కొనసాగించాలి.

గోకవరం మండలంలోని ఆర్ & ఆర్ కాలనీలు, గ్రామాలు, ఇతర ప్రభావిత ప్రాంతాలన్నింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలి.

తాగునీటి కొరత వల్ల ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ప్రత్యేక వైద్య, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.

శ్రీ సత్యసాయి వాటర్ సప్లై ఉద్యోగులు, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలి.

# ఏపీలో న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలి

## రామచంద్రపురంలో న్యాయవాదుల బైక్ ర్యాలీ





**రామచంద్రపురం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అత్యవసరంగా తీసుకురావాలని రామచంద్రపురం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ చట్టం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు, ప్రధాన కార్యదర్శి నీలం మధుసూదన్ రావుల ఆధ్వర్యంలో సోమవారం నాడు న్యాయవాదులు కోర్టు విధులకు దూరంగా ఉండి నిరసన తెలిపారు. ఇప్పటికే బీహార్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేస్తున్నారని, అదే తరహాలో ఏపీలోనూ వెంటనే దీన్ని అమలు చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నిరసనలో భాగంగా రామచంద్రపురం కోర్టు ప్రాంగణం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కార్యాలయం వరకు న్యాయవాదులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి. తారకేశ్వరావు, వి. నరేంద్ర కుమార్ రెడ్డి, సాదే నారాయణ రావు, వాడ్రెవు సాయి ప్రసాద్, దొమ్మాలపాటి సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీనివాస్, పిల్లి మురళి మోహనవెంకటరమణ, వాకలపూడి జయ శంకర్, పలివెల సత్యనారాయణ, జి. మల్లేశ్వరరావు, నక్క దుర్గా దేవి, ఎస్. బి. ఎస్. కుమార్ స్వామి, సూరంపూడి సత్యనారాయణ, శాఖ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

మంగళవారం, 08 సెప్టెంబర్ 2026
www.viswamvoice.com





# 3 వేల మంది అభ్యంతరాలు.. అయినా నిర్మాణం?

ప్రభుత్వ భూమిలో గుడి నిర్మాణం నిలిపివేయాలని డిమాండ్

18 నెలలుగా ఫిర్యాదులు.. పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు పారుపాక గ్రామస్తుల వినతి





**కాకినాడ, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** రౌతులపూడి మండలం పారుపాక గ్రామంలో ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న గుడి నిర్మాణంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ, వాటిని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

**ప్రభుత్వ స్థలంలో నిర్మాణం ఎందుకు?**

గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో గుడి నిర్మాణ పనులు చేపడుతున్నారని గ్రామస్తుడు జీవ జయబాబు తెలిపారు. ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని ఒక నిర్దిష్ట నిర్మాణానికి వినియోగించే ముందు గ్రామ ప్రజల అభిప్రాయాలను, సంబంధిత ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితి భవిష్యత్‌లో గ్రామంలో వివాదాలకు, మతపరమైన ఉద్రిక్తతలకు కారణమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**18 నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం**

ఈ అంశంపై గత 18 నెలలుగా జిల్లా, మండల స్థాయి అధికారులకు పీజీఆర్ఎస్ ద్వారా పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయించడంతో పాటు న్యాయపరమైన చర్యల్లో భాగంగా కోర్టును కూడా ఆశ్రయించినట్లు వివరించారు. ఇన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతున్న పరిస్థితి నెలకొనడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులు, నిర్మాణానికి ఉన్న అనుమతులు, స్థల వినియోగానికి సంబంధించిన నిబంధనలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు.

**ప్రజా ప్రయోజనాలకే స్థలం వినియోగించాలి**

సుమారు 3 వేల మంది గ్రామస్తుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత స్థలంపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. విచారణ పూర్తయ్యే వరకు నిర్మాణ పనులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వ స్థలాన్ని గ్రామంలోని పాడి రైతులకు ఉపయోగపడే విధంగా, పశువైద్య సేవలు, ప్రజా అవసరాలకు అనుకూలంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

ఈ వ్యవహారంలో జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని స్థల పరిస్థితిని, ప్రభుత్వ రికార్డులను, నిర్మాణానికి సంబంధించిన అనుమతులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమస్యను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో గుంతబోయిన చిట్టిబాబు, వరాల బాబు, జి. నూకరాజు, జి. శివ, వెన్న అప్పలస్వామి, పల్లా దేవుడు తదితర గ్రామస్తులు ఉన్నారు.

ఎయిడ్స్ నియంత్రణలో

# కాకినాడ జిల్లాకు ప్రథమ స్థానం

## ఎయిడ్స్ నియంత్రణ అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్



**కాకినాడ, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎయిడ్స్ నియంత్రణలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి రాష్ట్రంలోనే ప్రథమ,దేశం లో ద్వితీయ స్థానంలో నిలిచిన కాకినాడ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అభినందించారు. పి.జి.ఆర్.ఎస్ హాలు నందు సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నాకో 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' పేరిట నిర్దేశించిన మూడు ముఖ్యమైన లక్ష్యాలను వివరిస్తూ మొదటి లక్ష్యంగా 95 శాతం మంది హెచ్.ఐ.వి బాధితులకు తమ వ్యాధి స్థితి పై పూర్తి అవగాహన మరియు తెలిసేలా చేయడం జరిగిందన్నారు. రెండవ లక్ష్యంగా 95 శాతం మంది బాధితులకు క్రమం తప్పకుండా యాంటీ రెట్రో వైరల్ థెరపీ చికిత్స ను అందించడం జరిగిందన్నారు. మూడవ లక్ష్యంగా చికిత్స పొందుతున్న రోగులలో వైరల్ లోడ్ సంఖ్య 1000 కంటే తక్కువగా ఉండేలా చూడటం జరిగిందన్నారు.? జూలై 31 వ తేది నాటికి రాష్ట్రం లోనే అత్యధికం గా జిల్లాలో 95 హెచ్.ఐ.వి కేసులను గుర్తించినందుకు గాను ఆగస్టు 12 వ తేది న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భం గా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ ప్రతిభా పురస్కారాన్ని జిల్లా అందుకుందన్నారు. జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో ఆగస్టు నెల లో ఇంటింటి ప్రచారం, కళాశాలల్లో అవగాహన సదస్సులు,వీధి నాటికలు ప్రైవేట్ ఆస్పత్రు ల్లో ఏఆర్టీ మందులు వాడుతున్న వారి సమాచారాన్ని సేకరించి నాకోకు నివేదించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 1వ తేది నాటికి నాకో నిర్దేశించిన అన్ని లక్ష్యాల ను పూర్తి చేసి, రాష్ట్రంలోనే మొదటి జిల్లాగా, దేశంలో రెండవ స్థానంలో నిలిచి "సురక్షిత విభాగం" లో కాకినాడ జిల్లా చేరిందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, నాకో సేవా కేంద్రాలు మరియు జిల్లా యంత్రాంగం సమన్వయం తోనే ఈ సాధన సాధ్యమైందని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు,ఎయిడ్స్ మరియు క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. చలమయ్య, డి.ఎం. హెచ్.ఓ డాక్టర్ కె. అనిత, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ పి. బాలాజీ, జిల్లా సూపర్ వైజర్ ఎ.బుజ్జి బాబు,జిల్లా గణాంక అధికారి ఎం. రత్నరాజు తదితరులు పాల్గొన్నారు

అమరావతి క్రీడల్లో రాణించిన

# జిల్లా జట్టును అభినందించిన కలెక్టర్

## నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**కాకినాడ, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** గత నెల ఆగస్టు 24 వ తేది నుండి 27 వ తేది వరకు తిరుపతి లో జరిగిన అమరావతి చాంపియన్ షిప్ 2026 లో రాష్ట్ర స్థాయి పోటీలలో 12 క్రీడాంశములు 2 కేటగిరులు (అండర్-17, 23) 386 మంది బాల బాలికలు, కోచ్ కం మేనేజర్లు 40 మంది జిల్లా కాకినాడ జిల్లా నుండి పాల్గొనుటకు వెళ్ళి, జట్టు ఈవెంట్లలో 3 మొదట స్థానములు, 3 రెండవ స్థానములు మరియు వ్యక్తిగత ఈవెంట్లలలో 4 మొదటి స్థానములు, 7 రెండవ స్థానములు సాదించి యున్నారు. ఈ క్రీడాకారులను సోమవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ నందు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్షిప్ పోటీలలో జిల్లా తరఫున క్రీడల్లో రాణించిన ప్రతి ఒక్కరిని ప్రత్యేకంగా అభినందిస్తూ క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం తో పాటు మెదడు చురుగ్గా పనిచేయడంతో చదువులో కూడా రాణించేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. పతకములు సాదించిన వారికి ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వారు నగదు బహుమతులను నేరుగా క్రీడాకారుల ఖాతాలోనికి జట్టు ఈవెంట్లలో మొదట స్థానము సాదించిన జట్టుకు మొత్తము నకు రూ.లక్ష రూపాయలు, రెండవ స్థానము సాదించిన జట్టు మొత్తమునకు రూ. 50 వేలు చొప్పున, వ్యక్తిగత ఈవెంట్లలో మొదట స్థానము సాదించిన క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు రూపాయలు చొప్పున, రెండవ స్థానము సాదించిన క్రీడారులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జమచేయు చున్నామని తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి వి.సతీష్ కుమార్,జిల్లా అధికారులు, జిల్లా,జిల్లా క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా లక్ష్యాలు సాధించాలని

# అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

## ఎంపీడీవోలు తహసీల్దారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్



**కాకినాడ, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అధికారులు ప్రతి అంశం లోనూ 100 శాతం లక్ష్యాలను సాధించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, క్షేత్ర స్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించి మండలాల వారీగా ప్రాధాన్యత అంశాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పలు ముఖ్యమైన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే అనంతరం ?పాస్ పుస్తకాల పంపిణీ రీ-సర్వే, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, రీ-సర్వే 4,5 దశల పురోగతి,బుక్ ఫర్ ప్రింటింగ్, పీఓడీ సబ్‌డివిజన్ అసైన్మెంట్ ప్రక్రియలను గడువు లోగా పూర్తి చేసి ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు.ప్రతి నెలా 2 వ తేదీ నుండి 9వ తేదీ వరకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వేగవంతంగా జరగాలన్నారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా హియరింగ్, 'బుక్ ఏ కాల్' ఫిర్యాదుల విచారణ త్వరగా పూర్తి చేసి ఫైనల్ పబ్లికేషన్‌కు సిద్ధం చేయాలన్నారు. ఫిర్యాదులు, ఫారాల పెండె న్సీలను ఈనెల 10వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. హెల్త్ క్లినిక్‌లు,సాలిడ్ వేస్ట్ కేంద్రాల నిర్మాణాల ప్రగతిపై సమీక్షిస్తూ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాల కొరకు తహసీల్దార్లు స్థలాలను ఎంపిక చేసి పంచాయతీ రాజ్ ఏఈ లకు అప్పగించాలన్నారు. స్థలాలు లేని చోట దాతలు లేదా జలవనరుల శాఖ భూములనుపరిశీలించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాల నిర్మాణాన్ని ప్రాధాన్యతగా చేపట్టాలన్నారు. కొత్త పింఛన్ల మంజూరు పై చర్చిస్తూ ఈనెల 7వ తేదీ నుండి 16వ తేదీ వరకు పింఛన్ దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయాలన్నారు. తహసీల్దార్లు ఆదాయ, ఒంటరి మహిళ, కుల ధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా మంజూరు చేస్తూ. అర్హులైన వయో వృద్ధులకు ఆధార్ వయస్సు ఆధారంగాను, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ, డప్పు కళాకారుల కు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ధ్రువీకరిస్తూ ఈనెల 26 నాటికి తుది నివేదికలను ప్రభుత్వం బడ్జెట్ మంజూరు కొరకు సమర్పించాలన్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు పనులు కల్పిస్తూ హాజరు శాతాన్ని పెంచి, మెటీరియల్ కాంపోనెంట్‌ను మెరుగు పరచాలన్నారు. 'జల ధార-జల హారతి' రెండో దశ కింద మంజూరైన రూ 2 కోట్ల నిధులతో నీటి వినియోగ దారుల సంఘాల అభిప్రాయా లకు అనుగుణంగా ప్రాధాన్యత పనులను ప్రతిపాదించాల న్నారు. వచ్చే ఏడాది నాటికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీ విధానంలో సాగునీరు అందేలా ప్రణాళికలు ఉండాలన్నారు. పుష్కర కాలువ మరమ్మతు పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.?అభివృద్ధి పనుల పురోగతి, సి ఎస్ ఆర్ , డి ఎం ఎఫ్ నిధులతో చేపట్టిన పనులు, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, 'కౌడ' పరిధిలోని సివిల్ పనులు, ఆర్ డబ్ల్యు ఎస్ పనులను త్వరితగతిన పూర్తి చేసి బిల్లులు సమర్పిం చాల న్నారు. పి 4, 'కౌశలం' కార్యక్రమాల్లో ఆశించిన పురోగతి సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి తిప్పే నాయక్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పిడి ఎస్ మధుసూదన్, ఎస్ జి ఎస్ డబ్ల్యూ మోడల్ అధికారి జే వేణుగోపాల్, ఆర్డబ్ల్యూఎస్ సూపరిం టెండెంట్ మహమ్మద్ అబ్దుల్ మదిన్, పంచా యతీరాజ్ డిఇ సత్యం, జలవనుల శాఖ ఇంజ నీర్లు జిల్లా స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# లోకేష్ జాబ్ ఎక్కడ...?

## మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలి - కాకినాడలో పోలీస్ ఉద్యోగ అభ్యర్థుల నిరసన ర్యాలీ



**కాకినాడ, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా పోలీస్ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేసి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ కాకినాడలో పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు శారదమ్మ గుడి సర్కిల్‌కు చేరుకుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లోకేష్ జాబ్ ఎక్కడ...? మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలి అంటూ అభ్యర్థులు నినాదాలు చేశారు. పోలీస్ ఉద్యోగాల కోసం చాలాకాలంగా సిద్ధమవుతున్న తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలని వారు కోరారు. శారదమ్మ గుడి సర్కిల్ వద్ద కొంతసేపు నిరసన తెలిపిన అనంతరం అభ్యర్థులు భారీ ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని భారీ ధర్నా నిర్వహించారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని నిరసనకారులు పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటూ, పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేసి, నియామక ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని, వయోపరిమితి తదితర అంశాల్లో అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరారు.

# అన్నా క్యాంటీన్‌లో ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి

## మెప్మా డిస్ట్రిక్ రీసోర్స్ పర్సన్ పొన్నల దినకర్



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :**అన్న క్యాంటీన్ పరిసరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉంచుతూ.. ప్రజలకు ఆరోగ్యకర వాతావరణం కల్పించాలని మెప్మా డిస్ట్రిక్ రీసోర్స్ పర్సన్, ట్రైనర్ పొన్నల దినకర్ సూచించారు. సోమవారం క్వారీ మార్కెట్ సెంటర్లోని అన్నా క్యాంటీన్ నందు అడ్వైజరీ కమిటీ సమక్షంలో నిర్వాహకులు మరియు సిబ్బందికి ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, క్యాంటీన్ పరిసరాలలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణపై పలు సూచనలను అందించారు. లబ్ధిదారులకు వసతుల కల్పనలో ఎటువంటి లోపం లేకుండా చూడాలని పేర్కొన్నారు. భోజనశాల, వడ్డించు ప్రదేశం, క్యాంటీన్ ఆవరణ నిరంతరం శుభ్రపరుస్తూ ఆహ్లాదకర వాతావరణం అందించాలన్నారు. ప్రజల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ.. క్యాంటీన్ నిర్వహణను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఈ మదర్షా అలీ, సీఎంఎం రామలక్ష్మి, అడ్వైజరీ కమిటీ సభ్యులు, క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఛాంబర్ అధ్యక్షుడిగా టీడీపీ సీనియర్ నాయకులు

# మద్దుల మురళీకృష్ణ నియామకం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 7, విశ్వంవాయిస్ న్యూస్ :** ది రాజమండ్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మద్దుల మురళీకృష్ణను నియముంచుకున్నారు ఛాంబర్ సభ్యులు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన తవ్వా రాజా పదవీకాలం ముగియనుండటంతో పాటు, వ్యక్తిగత కారణాలతో అధ్యక్ష పదవి నుంచి వైదొలగడంతో ఆయన స్థానంలో మద్దుల మురళీకృష్ణను నియమించి ఆ మేరకు తీర్మానం చేశారు. ఛాంబర్ కార్యవర్గంలోని ఇతర సభ్యుల్లో ఎలాంటి మార్పులు చేయకుండా, అధ్యక్ష పదవికి మాత్రమే మార్పు చేస్తూ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. గతంలో ఛాంబర్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన మద్దుల మురళీకృష్ణకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గతంలో ఇచ్చిన హామీ మేరకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు ఛాంబర్ వర్గాలు తెలిపాయి. ఛాంబర్‌లో మరోసారి ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం ద్వారా అనవసరమైన విభేదాలకు తావివ్వకుండా, ఇప్పటికే ఇచ్చిన మాటకు అనుగుణంగా అధ్యక్ష పదవిలో మాత్రమే మార్పు చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. ఆయన సూచనను గౌరవించిన వర్తక పెద్దలు, ఛాంబర్ సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించి మద్దుల మురళీకృష్ణను అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. మిగిలిన కార్యవర్గాన్ని యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు. అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన ఛాంబర్ సభ్యులకు మద్దుల మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారులు, వాణిజ్య వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, వ్యాపార వర్గాల ప్రయోజనాలను పరిరక్షించేలా ఛాంబర్‌ను మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఛాంబర్‌లో ఐక్యత, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కొనసాగించేందుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేసిన సూచనలు అభినందనీయమని పలువురు వర్తక పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దుల మురళీకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా వ్యాపార వర్గాలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని, వారి సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని ఆకాంక్షించారు. కాగా నూతన అధ్యక్షుడు మద్దుల మురళీకృష్ణ, ఛాంబర్ కార్యవర్గ సభ్యులు, పలువురు వర్తకులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను ఈ రోజు తిలక్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసు వారిని అభినందించారు. మురళీకృష్ణ అధ్యక్షుడిగా ఎంపిక కావడంపై పార్టీ శ్రేణులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# వినాయక చవితి పందిరి రాట ముహూర్తం




**రాయవరం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలోని శ్రీనివాసం అపార్ట్మెంట్స్ లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తంతో శ్రీకారం చుట్టారు. పురోహితులు కె.సీతారామ శర్మ సూచనల మేరకు శుభ ముహూర్తంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, పూలతో రాటను ప్రతిష్ఠించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి మండపం, విద్యుత్ అలంకరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, శ్రీనివాసం అపార్ట్మెంట్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### రఘుదేవపురంలో నూతన గృహప్రవేశ వేడుకలో

# పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘు దేవపురం గ్రామంలో పలపాల లోవరాజు వారి నూతన గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ శుభ కార్యక్రమానికి రాజానగరం నియోజకవర్గ శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగు పెట్టిన లోవరాజు కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ దైవాశీస్సులు ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సంతోషంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ బత్తుల వెంకటలక్ష్మి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ సేవా సంఘం సర్వసభ్య సమావేశం

### మూడేళ్ల కాలానికి నూతన కార్యవర్గం ఎన్నిక



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 7, విశ్వంవాయిస్ న్యూస్ :** నగర బ్రాహ్మణ సేవా సంఘం సర్వ సభ్య సమావేశం స్థానిక లలితా నగర్ లోని శ్రీ భార్గవ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా 2026 నుండి 2029 వరకు మూడు సంవత్సరాల కాలానికి నూతన కార్యవ ర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి అధ్యక్షులు పుట్రేవు సూర్య వెంకట రావు అధ్యక్షత వహించారు. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా కొచ్చర్లకోట సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా వేదుల శేషగిరి వరప్రసాద్, కార్యదర్శిగా భాగవతుల వెంకట రమణమూర్తి, కోశా ధికారిగా చల్లా వెంకట సూర్యనారా యణ, జాయింట్ సెక్రటరీగా పెరవలి వెంకట శేషాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా పుట్రేవు సూర్య వెంకటరావు, గౌరవ సలహాదారులుగా భాగవతి నారాయణ శాస్త్రి (బాబి), వాడ్రేవు వేణుగోపాలరావు నియమితులయ్యారు. నగర బ్రాహ్మణ సేవా సంఘంలో అభివృద్ధికి తాను చేసిన కృషిని, కార్యక్రమాలను సభికులకు పుట్రేవు సూర్య వెంకటరావు వివరిం చారు. ఈ సమావేశంలో ప్రయాగ సుబ్రహ్మణ్యం, కల్లూరి గౌరీ సోమయాజులు, పులగుర్త దుర్గాప్రసాద్, అడ్వకేట్ పి ఎల్ ఎన్ ప్రసాద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న అధ్యక్షులైన కొచ్చర్లకోట సుబ్బారావు వినాయక చతుర్థి సందర్భంగా వినాయక ప్రతిమలను, వ్రత కల్పం పుస్తకాలను సభ్యులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన సభ్యులకు సెక్రటరీ భాగవతుల వెంకట రమణమూర్తి ధన్యవాదాలు తెలియజేసారు. సమావేశంలో ఇంద్రగంటి సూరిబాబు, ఎం.లక్ష్మణ శాస్త్రి, రాజనాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఎంబిబీఎస్ విద్యార్థిని జెన్నిఫర్‌కు

# ఫీజు చెల్లించిన డాక్టర్ రాము



**మండపేట టౌన్, సెప్టెంబర్ 7, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇచ్చిన మాట ప్రకారం పేద విద్యార్థిని జెన్నిఫర్ కు మండపేటకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రాము మొదటి సంవత్సరం ఫీజు చెల్లించారు. బిక్కవోలు కు చెందిన నిరుపేద విద్యార్థిని జెన్నిఫర్ కు డాక్టర్ రాము ఆర్థిక సహాయం అందించడం, ఆమె నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం, ఆపై ఎంబీబీఎస్ సీటు సాధించడం, ఇటీవల మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చేతుల మీదుగా కొంత ఆర్థిక సహాయం అందించడం ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలే. కాగా మొత్తం ఐదేళ్ల ఎంబీబీఎస్ కోర్సుకు గానూ మొదటి సంవత్సరం ఆమె యూనివర్శిటీ ఫీజు 1,73,150 రూపాయలు అవసరం కాగా వాటిని డాక్టర్ రాము యూనివర్శిటీ పేరిట ఆర్టీజీఎస్ చేశారు. అలాగే ఆమెకు అవసరమైన ఇతర ఖర్చులతో పాటు మిగిలిన నాలుగేళ్ల ఫీజును తప్పనిసరిగా చెల్లిస్తానని డాక్టర్ రాము తెలిపారు.

# రైతులకు ఉచితంగా ఫలసాయ మొక్కలు

### రాయవరం, పసలపూడి రైతులకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కార్యక్రమం

**రాయవరం, సెప్టెంబర్ 7, విశ్వంవాయిస్ న్యూస్ :** రైతుల వ్యవసాయాభివృద్ధి, అదనపు ఆదాయమే లక్ష్యంగా రాయవరం, పసలపూడి గ్రామాల కిసాన్ మోర్చా గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఉచితంగా ఫలసాయ మొక్కలను అందించేందుకు కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల పరిధిలోని రైతులు తమ పొలాల గట్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో మామిడి, జామ, నిమ్మ తదితర ఫలసాయ మొక్కలను నాటుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందాలనుకునే రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. తమకు అవసరమైన ఫలసాయ మొక్కల రకం, సంఖ్యను కూడా ముందుగా తెలియజేయాలని సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కిసాన్ మోర్చా గ్రామ కమిటీలు కోరాయి. మరిన్ని వివరాలకు రాయవరం గ్రామానికి చెందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 9603936880, పసలపూడికి చెందిన నల్లమిల్లి అప్పారెడ్డి 9912234277 ను సంప్రదించాలని తెలిపారు.

### ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు

# దరఖాస్తుల స్వీకరణ

### సెప్టెంబరు 7 నుంచి 16 వరకు అవకాశం..

### స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు



**రాయవరం, సెప్టెంబర్ 7, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల కోసం అర్హుల నుంచి సెప్టెంబరు 7 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాయవరం ఎంపీడీవో కె.వి.ఎస్.ఎస్. సూర్యనారాయణ మూర్తి తెలిపారు. మండలంలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో పనివేళల్లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రైస్ కార్డు, ఆదాయ ధ్రువపత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. కాగా ఈ-కేవైసీ తప్పనిసరి అని, అర్హత పరిశీలన, భౌతిక తనిఖీ అనంతరం రాష్ట్రస్థాయిలో తుది మంజూరు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. నిర్ణీత గడువు 16వ తేదీ లోగా అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

### ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్‌కు

# అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

### ఎంపీడీవో భారతి



**సీతానగరం, సెప్టెంబర్ 7, విశ్వంవాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పెన్షన్‌కు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ ది. వి.07/09/26 నుండి 16/09/26 వ తేదీ వరకు స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించబడును. ప్రతీ పింఛన్ దరఖాస్తు ఫారాలను సంబంధిత స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాల యంలో పొందవచ్చును. ఎస్ జి ఎస్ డబ్ల్యు వెబ్సైట్,ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం వెబ్సైట్లో కూడా దరఖాస్తు ఫారం అందుబాటులో ఉంటుంది. పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని సంబంధిత స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయంలో అవసరమైన సహాయక పత్రాలు ధ్రువపత్రాలుతోసమర్పించాలి. ధరఖాస్తును డిజిటల్ అసిస్టెంట్ వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ (డబ్ల్యు ఈ డి పి ఎస్) స్వీకరించి ప్రాథమిక వివరాలను పరిశీలించి ఆన్లైన్లో నమోదు చేస్తారు. నమోదు పూర్తయిన తరువాత దరఖాస్తును సిస్టమ్ ద్వారా జనరేట్ అయ్యి రసీదు అందజేస్తారు. కావున సీతానగరం మండల పరిధిలోగల అర్హత కలిగిన వృద్ధులు వితంతువులు దివ్యాంగులు తదితరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల ఇంటింటి సర్వే



**మండపేట టౌన్, సెప్టెంబర్ 7, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.1113, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 59 పట్టణ స్థానిక సంస్థలలో వార్డుల వారీగా ఫోటోతో కూడిన ఓటర్ల జాబితా తయారీ సీట్ల రిజర్వేషన్ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా మండపేట పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు 5 రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు కమీషనర్ టి.వి. రంగారావు తెలిపారు. ఈ సర్వే కోసం వచ్చే బీఎల్ఓలు మున్సిపల్ సిబ్బంది ప్రతి వార్డులో ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితా ఆధారంగా కులం, లింగం తదితర వివరాలను ధృవీకరించనున్నారని పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలోని ప్రజలందరూ సర్వే బృందాలకు పూర్తిగా సహకరించి, సరైన సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఓటర్ల గుర్తింపు ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# మునికూడలిలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



**సీతానగరం, సెప్టెంబర్ 7, విశ్వంవాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని మునికూడలి గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సంక్షేమం అభివృద్ధి పదంలో నడుస్తుందని ఈ సందర్భంగా వెంకటరమణ చౌదరి అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గెద్దం తిమ్మారావు, గద్దె వెంకటకృష్ణ చౌదరి, వలవల రాజా, కాండ్రు శేఖర్, సానిపిన్ని రామారావు, గద్దె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# మంచు మనోజ్ అలాంటి పాత్రలో కనిపిస్తాడా..?




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ హీరోగా, గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దాదా'పై ప్రేక్షకుల్లో సాలిడ్ బజ్ క్రియేట్ అయ్యింది. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన టైటిల్ గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేసింది. కాగా, ఈ సినిమాలో మంచు మనోజ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు మేకర్స్ తెలిపారు. 'మిరాయ్' చిత్రం తర్వాత మనోజ్ మళ్లీ విలన్ అవతారంలో అలరించబోతుండటం, అందునా బాలకృష్ణకు విలన్‌గా ఒక క్రూరమైన పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు గోపీచంద్ మలినేని తెలిపిన వివరాల ప్రకారం.. మనోజ్ ఇప్పటివరకు కనిపించని ఒక సరికొత్త మరియు భయంకరమైన లుక్‌లో ఈ సినిమాలో కనిపించనున్నారని తెలుస్తోంది. బాలకృష్ణ చిత్రాలలో విలన్ పాత్రలకు ఉండే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందేనని, ఈ పాత్రకు మనోజ్ తన నటనతో మరింత పవర్‌ను తెస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని 2026 డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# మాధురి రాథోడ్, ఈశ్వర సాయి కేసులో మరో ట్విస్ట్..



గత కొన్ని రోజులుగా ఫోక్ డ్యాన్సర్స్ మాధురి రాథోడ్, ఈశ్వర్ సాయి పేర్లు వార్తలలో తెగ నిలుస్తున్నాయి. తనను పెళ్లిపేరుతో ఈశ్వర సాయి మోసం చేశాడని ఇదివరకే పోలీసులను ఆశ్రయించింది మాధురి. అయితే కంప్లైంట్ ఇచ్చి రోజులు గడుస్తున్నప్పటికీ ఈశ్వర సాయిని అరెస్ట్ చేయకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన ఆమె ఆదివారం ఆత్మహత్య ప్రయత్నం చేసింది. ఫోక్ సాంగ్స్ ద్వారా యూట్యూబ్, సోషల్ మీడియా ప్రపంచంలో మంచి పాపులారిటీ సంపాదించుకుంది మాధురి రాథోడ్. కానీ తన తోటి ఫోక్ ఆర్టిస్ట్ ఈశ్వర్ సాయితో తీవ్ర వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. పెళ్లి పేరుతో తనను నమ్మించి మోసం చేశాడంటూ మాధురి ఇదివరకే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది మాధురి. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ ఈశ్వర సాయిని అరెస్ట్ చేయకపోవడం, పోలీసులు చర్యలు తీసుకోకపోవడం పట్ల మాధురి తీవ్ర మస్థాపానికి గురైంది. న్యాయం జరగడం లేదన్న ఆవేదనతో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కాపాడటంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసుల వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన మాధురి, నిందితుడిని కేసు నుండి తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇదెలా ఉంటే మాధురి రాథోడ్, ఈశ్వర సాయి వివాదంలో మరో ట్విస్ట్ నెలకొంది. ఈశ్వర్‌సాయిపై మరోసారి మాధురి స్టేట్‌మెంట్ ఇచ్చింది మాధురి. 16 రోజులైనా ఈశ్వర్ సాయిని ఎందుకు అరెస్ట్ చేయట్లేదు అంటూ ప్రశ్నించింది. 24 గంటల్లో ఈశ్వర సాయిని అరెస్ట్ చేస్తామని చెప్పారు పోలీసులు. దీంతో ఈశ్వర సాయితోపాటు అతడి భార్య శరణ్య, సంధ్యారాణిపై మరోసారి కేసు నమోదు చేసింది మాధురి.

బ్లాక్ బస్టర్ 'హనుమాన్' సినిమాను మిస్ చేసుకున్న హీరోలు తెలుసా?

# ఒకరు కాదు ఇద్దరు రిజెక్ట్ చేశారు



2024 సంక్రాంతి కానుకగా రిలీజైన హనుమాన్ సినిమా సంచలన విజయం సాధించింది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా 300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి సంక్రాంతి విన్నర్ గా నిలిచింది. ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ఈ డివోషనల్ థ్రిల్లర్ మూవీలో తేజ సజ్జా హీరోగా నటించగా, అమృతా అయ్యర్ హీరోయిన్ గా నటించింది. 'కొన్ని సినిమాలు కొందరికే రాసి పెట్టి ఉంటాయి'. ఇండస్ట్రీలో సినిమాలు చేతులు మారడం చాలా కామన్. ఒక హీరో/ హీరోయిన్ చేయాల్సిన సినిమా ఇంకో హీరో, హీరోయిన్ దగ్గరకు వెళ్లడం ఇక్కడ పరిపాటిగా జరుగుతుంటుంది. అలా చేతులు మారిన సినిమాలు ఒక్కోసారి హిట్ కావొచ్చు. మరోసారి ఫ్లాప్ కావొచ్చు. ప్రశాంత్ వర్మ– తేజ సజ్జా కాంబినేషన్ లో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ హనుమాన్ విషయంలోనూ ఇలాగే జరిగింది. 2024 సంక్రాంతి కానుకగా రిలీజైన ఈ డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. కేవలం 40 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కి ఏకంగా రూ. 300 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. కేవలం తెలుగులోనే కాదు హిందీ తదితర భాషల్లోనూ హనుమాన్ సినిమాకు భారీ కలెక్షన్లు వచ్చాయి. హనుమాన్ సినిమాలో తేజ సజ్జా సరసన అమృతా అయ్యర్ హీరోయిన్ గా నటించింది. అలాగేవరలక్ష్మీ శరత్ కుమార్ హీరో సోదరి పాత్రలో నటిస్తే వినయ్ రాయ్ క్రూరమైన విలన్ పాత్రలో భయపెట్టాడు. కాగా ఈ సినిమాలో భాగమైన వారికి మంచి గుర్తింపు వచ్చంది ముఖ్యంగా హనుమాన్ సినిమా విజయం తో హీరో తేజ సజ్జా రేంజ్ మారిపోయింది. పాన్ ఇండియా రేంజ్ లో అతనికి మంచి గుర్తింపు వచ్చింది. స్టార్ డైరెక్టర్లు సైతం తేజ సజ్జాతో సినిమాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇదిలా ఉంటే హనుమాన్ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తకర విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే.. ఈ బ్లాక్ బస్టర్ మూవీకి హీరోగా తేజ సజ్జా ఫస్ట్ ఛాయిస్ కాదట. దర్శకుడు ప్రశాంత్ వర్మ మొదట హనుమాన్ సినిమాను స్టార్ హీరోలతో చేయాలని భావించారట. అందుకోసం పలువురు స్టార్స్ ను సంప్రదించారట. అయితే వారు వివిధ కారణాలతో రిజెక్ట్ చేశారట. మొదట పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ కు ఈ కథ వినిపించారట ప్రశాంత్ వర్మ. అయితే బన్నీకి ఈ స్టోరీ బాగా నచ్చినప్పటికీ అప్పటికే బిజీ షెడ్యూల్ తో ఉండడం వల్ల ఈ సినిమా చేయలేకపోయాడట. ఆ తర్వాత ఇదే స్టోరీతో న్యాచురల్ స్టార్ నానిని కలిశారట డైరెక్టర్. అయితే నాని కూడా వివిధ సినిమాలతో బిజీగా ఉండడంతో హనుమాన్ పై ఇంట్రెస్ట్ చూపించలేదట. దీంతో చివరికి తన ఫ్రెండ్ అయిన తేజ సజ్జాను ఈ సినిమాలో హీరోగా తీసుకున్నారట ప్రశాంత్ వర్మ. అంతకు ముందు వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన జాంబిరెడ్డి సినిమా కూడా సూపర్ హిట్టుగా నిలిచింది. దీంతో తేజ సజ్జాని హీరోగా పెట్టి చాలా తక్కువ బడ్జెట్ లోనే హనుమాన్ సినిమాని బెస్ట్ అవుట్ పుట్‌తో కంప్లీట్ చేశాడు ప్రశాంత్ వర్మ.

# గాలె టెస్టులో టీమిండియా పట్టు..
# లంకపై స్పిన్నర్ల పంజా.. భారత్‌కు భారీ లీడ్




తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగులు చేయగా, శ్రీలంక తమ మొదటి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌటైంది.

మొదటి ఇన్నింగ్స్ ముగిసే సమయానికి టీమిండియా 178 పరుగుల కీలక ఆధిక్యాన్ని దక్కించుకుంది.

భారత బౌలర్లలో మానవ్ సుతార్ 4 వికెట్లు, రవీంద్ర జడేజా 3 వికెట్లు పడగొట్టి లంక ఇన్నింగ్స్‌ను కట్టడి చేశారు.

గాలె వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు బలమైన పట్టు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 462 పరుగులకు ఆలౌట్ కాగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక తమ మొదటి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగుల స్పష్టమైన ఆధిక్యం లభించింది.

**ఆదుకున్న సోనాల్ దినుష, డిక్‌వెల్లా**

తొలి ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంక వరుసగా వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. కేవలం 90 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయిన దశలో సోనాల్ దినుష (100), నిరోషన్ డిక్‌వెల్లా (80) జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి ఆరో వికెట్‌కు 146 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. అర్ధ శతకంతో రాణించిన డిక్‌వెల్లాను ప్రసిద్ధ్ కృష్ణ ఔట్ చేయడంతో ఈ కీలక భాగస్వామ్యం ముగిసింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా పట్టుదలతో ఆడిన సోనాల్ దినుష టెస్ట్ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు.

**సుతార్, జడేజా బౌలింగ్ జోరు**

గాలె పిచ్‌పై భారత స్పిన్నర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేసి లంక ఇన్నింగ్స్‌ను దెబ్బతీశారు. మానవ్ సుతార్ 76 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశారు. పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణతో పాటు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ చెరో వికెట్ దక్కించుకున్నారు. 178 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో భారత్ మ్యాచ్‌లో పైచేయి సాధించింది.

## సింగిల్ రన్ ఇవ్వకుండా 5 వికెట్లు..
## 149 ఏళ్ల టెస్టు చరిత్రలోనే జస్టిన్ గ్రీవ్స్ అరుదైన రికార్డు!



టెస్టు క్రికెట్ చరిత్రలో ఎవరూ సాధించని అరుదైన రికార్డును వెస్టిండీస్ ఆల్‌రౌండర్ జస్టిన్ గ్రీవ్స్ నమోదు చేశారు. త్రినిడాడ్‌లోని బ్రియన్ లారా క్రికెట్ అకాడమీ వేదికగా పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు ఆటలో గ్రీవ్స్ సంచలన బౌలింగ్‌తో విరుచుకుపడ్డారు. ఈ మ్యాచ్‌లో ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా వరుసగా 5 మేడెన్ ఓవర్లు వేసి, ప్రతీ ఓవర్‌లో ఒక్కో వికెట్ తీసి చరిత్ర సృష్టించారు. దీనికి సంబంధించిన వైరల్ వీడియో ప్రస్తుతం నెట్టింట హల్‌చల్ చేస్తోంది. పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగి మద్దతుగా నిలుస్తున్న సమయంలో గ్రీవ్స్ ఈ రికార్డ్ స్పెల్ వేశారు. షాన్ మసూద్, మహమ్మద్ రిజ్వాన్, ఆమిర్ జమాల్, అలీ ఉస్మాన్, మహమ్మద్ అబ్బాస్‌లను ఆయన వరుసగా పెవిలియన్ పంపారు. 149 ఏళ్ల సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలోనే ఇలా వరుసగా 5 మేడెన్ ఓవర్లలో 5 వికెట్లు సాధించిన ఏకైక బౌలర్‌గా జస్టిన్ గ్రీవ్స్ రికార్డు పుస్తకాల్లోకి ఎక్కారు. ఈ ప్రదర్శనతో ఇంగ్లాండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ పేరిట ఉన్న రికార్డును గ్రీవ్స్ అధిగమించారు. 2016లో దక్షిణాఫ్రికాపై స్టువర్ట్ బ్రాడ్ వరుసగా 4 మేడెన్ ఓవర్లలో 4 వికెట్లు పడగొట్టగా, ఇప్పుడు గ్రీవ్స్ ఏకంగా 5 వికెట్లతో ఆ రికార్డును చెరిపివేశారు. మొత్తంమీద ఈ ఇన్నింగ్స్‌లో గ్రీవ్స్ 11 ఓవర్లు వేసి 27 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టారు. టెస్టుల్లో ఆయనకు ఇది తొలి ఐదు వికెట్ల (5–టశీతీ) ప్రదర్శన కావడం విశేషం. వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ చేజ్ ఇచ్చిన సూచనల మేరకు క్రమశిక్షణతో సరిగ్గా గురిచూసి బౌలింగ్ చేయడం వల్లే ఈ ఫలితం దక్కిందని మ్యాచ్ అనంతరం గ్రీవ్స్ తెలిపారు. గ్రీవ్స్ దాటికి పాకిస్తాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 282 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో వెస్టిండీస్‌కు 29 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది.




# ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్..

## 3ఏళ్ల తర్వాత ఎస్ఆర్‌హెచ్ స్టార్ ప్లేయర్ రీఎంట్రీ..!




ఆస్ట్రేలియాతో సెప్టెంబర్ 24 నుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌కు దక్షిణాఫ్రికా 16 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. టెంబా బవుమా కెప్టెన్‌గా తిరిగి రానుండగా, గెరాల్డ్ కోయెట్జీ మూడేళ్ల తర్వాత వన్డే జట్టులోకి వచ్చాడు. క్వింటన్ డి కాక్, డేవిడ్ మిల్లర్‌లకు కూడా చోటు దక్కింది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌కు దక్షిణాఫ్రికా 16 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. సెప్టెంబర్ 24 నుంచి 30 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. టెంబా బవుమా ఫిట్‌నెస్ సమస్యలను అధిగమించి జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. వన్డే ప్రపంచ కప్‌నకు సన్నాహకంగా ఈ సిరీస్‌ను దక్షిణాఫ్రికా చూస్తోంది.

**రబడాకు భారీ షాక్..**

స్టార్ పేసర్ కగిసో రబడ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండటం లేదు. హ్యామ్‌స్ట్రింగ్‌కు గ్రేడ్–3 గాయం కావడంతో అతడు దాదాపు 9–10 వారాల విశ్రాంతి తీసుకోవాల్సి ఉంది. మరోవైపు ఐడెన్ మార్క్రమ్ తొలి వన్డేకు దూరంగా ఉంటాడు. రెండో, మూడో మ్యాచ్‌లకు అతడు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. తొలి మ్యాచ్‌కు అతడు ఎందుకు దూరమవుతున్నదన్న కారణాన్ని ప్రోటీస్ గోప్యంగా ఉంచింది.

**మూడేళ్ల తర్వాత కోయెట్జీ..**

సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ గెరాల్డ్ కోయెట్జీకి వన్డే జట్టులో తిరిగి చోటు లభించింది. చివరిసారిగా 2023 మార్చిలో వెస్టిండీస్‌పై ODI ఆడిన అతడు.. ఇప్పుడు మూడేళ్ల విరామం తర్వాత మళ్లీ వన్డే సెటప్‌లోకి వచ్చాడు. క్వింటన్ డి కాక్, డేవిడ్ మిల్లర్‌లను కూడా సెలెక్టర్లు ఎంపిక చేశారు. సెంట్రల్ కాంట్రాక్ట్‌లో లేకపోయినా ఇద్దరినీ జట్టులోకి తీసుకోవడం 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో వారి పేర్లు ఉన్నాయనే సంకేతంగా నిలిచింది. రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్న డి కాక్.. 2025 డిసెంబరులో భారత్‌పై తన చివరి వన్డేలో సెంచరీ చేశాడు. మిల్లర్‌కు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత దక్షిణాఫ్రికా వన్డే జట్టులో ఇదే తొలి అవకాశం.

**2023లో ఆస్ట్రేలియాపై అదరగొట్టిన ప్రోటీస్..**

దక్షిణాఫ్రికా జట్టులో టెంబా బవుమా, ఒట్నీల్ బార్ట్‌మన్, కార్బిన్ బోష్, మాథ్యూ బ్రీట్జ్కీ, గెరాల్డ్ కోయెట్జీ, క్వింటన్ డి కాక్, టోనీ డి జోర్జీ, బ్జోర్న్ ఫోర్టుయిన్, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, క్వేనా మఫాకా, ఎయిడెన్ మార్క్రమ్, డేవిడ్ మిల్లర్, లుంగి ఎంగిడి, రియాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్ ఉన్నారు. నమీబియాతో ఆడే జట్టులో ఉన్న టోనీ డి జోర్జీ మాత్రమే ఆ సిరీస్ నుంచి ఆస్ట్రేలియా వన్డేలకు కూడా ఎంపికయ్యాడు. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన చివరి ODI సిరీస్‌లో ఇరు జట్లు ఐదు మ్యాచ్‌లు ఆడాయి. తొలి రెండు మ్యాచ్‌లు కోల్పోయిన ప్రోటీస్.. చివరి మూడు గెలిచి 3–2తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com